సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 658 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



6న జెడ్పీ సమావేశం

అనంతపురం జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే 6వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎండీ అమృతరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.8°/21.5°

జిల్లా అంతటా గురువారం సూర్యప్రతాపం. ఉక్కపోత అధికంగా ఉంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

తంగేడుకుంట రైతులకు న్యాయం చేస్తాం

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



స్పందన హాల్‌లో రైతుల భూమి పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఓడీసీ మండలం తంగేడుకుంటలో శ్రోత్రియం భూములు సాగు చేసుకుంటూ హక్కు పత్రాలు కలిగిన రైతులందరికీ న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని 'స్పందన' హాలులో శ్రోత్రియం భూములు సాగుచేసుకుంటున్న రైతులతో సమావేశమయ్యారు. ఏడీ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీధర్ సమక్షంలో 36 మంది రైతుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. అనంతరం జేసీ చేతన్ మాట్లాడుతూ, ఒరిజినల్ పత్రాలు లేని వారు సర్టిఫైడ్ నకలును సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తీసుకుని అధికారులకు అందజేయాలన్నారు. వాటిని పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సుమారు 400 మంది రైతులకు 1,000 ఎకరాల వరకూ పట్టాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేశామన్నారు. మరో 500 ఎకరాలకు 200 మంది రైతులు క్లెయిమ్‌లు సమర్పించినట్లు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల నాలుగు రోజులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ గురువారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో దిగువ ట్రోపో ఆవరణలో వ్యాపించిన అల్పపీడన ద్రోణి, అలాగే ఆగ్నేయ, నైరుతి దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాగల నాలుగు రోజులూ తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు. ముఖ్యంగా ఈనెల 30, మే 1వ తేదీ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షసూచన ఉందన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) బీటెక్ ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ. కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. చంద్రమోహన్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. బీటెక్ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-20) రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్-15), (ఆర్-19) సప్లిమెంటరీ, ఎంబీఏ మొదటి సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ, ఎంసీఏ నాలుగు, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఎన్‌పీకుంట/గాండ్లపెంట: పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ మాధవ రెడ్డి సూచించారు. ఎన్‌పీకుంట, గాండ్లపెంట పోలీస్‌స్టేషన్లను గురువారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కేసుల రికార్డులు పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలు, సమస్యలపై ఎస్‌ఐలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. త్వరలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ భవ్యకిషోర్, రూరల్ సీఐ శంకర్‌నాయక్, ఎస్‌ఐ సద్గురుడు, హెచ్‌సీ రామయ్య, సిబ్బంది తదితరులున్నారు.

అక్రమాల రిజిస్ట్రేషన్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా వసూళ్లు
- భూముల విలువ తగ్గించి రిజిస్ట్రేషన్లు
- మ్యారేజ్ సర్టిఫికెట్ల జారీకీ ముక్కుపిండి ఫైకం
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- పెనుకొండ, కదిరి, హిందూపురం కార్యాలయాల్లో ఎక్కువగా గోల్‌మాల్!

- అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న మహిళకు తన తల్లి నుంచి కొంత ఆస్తి సంక్రమించింది. దీన్ని తనపేరుపై మార్చుకునేందుకు కొన్ని రోజుల క్రితం ఆమె అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లింది. పని పూర్తి కావాలంటే రూ.50 వేలు ఇవ్వాలని అక్కడి సిబ్బంది డిమాండు చేయడంతో నర్సు కన్నీటి పర్యంతమైంది. ఈ విషయాన్ని ఆమె వివాదం చేస్తుందేమోనన్న భయంతో సిబ్బంది పని పూర్తి చేశారు.

- రాప్తాడు మండలం జంగాలపల్లెకు చెందిన ఓ రైతు జగనన్న యంత్రసేవ కింద లోను పొందేందుకు అర్హత పొందారు. లోను రావాలంటే భూమిని రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్ట్‌గేజ్ చేయాలని అధికారులు చెప్పారు. దీంతో ఆయన రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని ఆశ్రయించగా రూ.5 వేలు ఇస్తేనే పని చేస్తామని చెప్పారు. అంత డబ్బు లేక బాధితుడు అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. ఇవి మచ్చుకు రెండు ఉదాహరణలు మాత్రమే. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. ధ్రువపత్రాలు సరిగ్గా ఉన్నా ఏదో ఒక కొర్రీ వేసి అక్కడి సిబ్బంది వసూళ్లకు దిగుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. మ్యారేజ్ సర్టిఫికేట్ కావాలన్నా రూ. నాలుగైదు వేలు లంచం లేనిదే పని చేయడం లేదు. అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే కొంతమంది మ్యారేజ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటే భారీగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రెండు రోజుల క్రితం అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు ఒక ప్రైవేట్ వ్యక్తి నుంచి రూ.లక్షల్లో అనధికారిక నగదు స్వాధీనం చేసుకోవడం చూస్తే కార్యాలయంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కాగ్ రిపోర్టులో సంచలన విషయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఎంత నిఘా ఉంచినా సిబ్బంది చేసేది మాత్రం చేస్తూనే ఉన్నారు. దస్తావేజులను సరైన వర్గీకరణ చేయకపోవడం, ఆస్తుల విలువను తగ్గించి రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల సర్కారుకు భారీగా నష్టం వాటిల్లినట్లు కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) రిపోర్టులో తాజాగా తేలింది. కోట్లాది రూపాయల మేర జరిగిన గోల్‌మాల్ బట్టబయలైంది.

పలు రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అవకతవకలు..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలోని హిందూపురం, కదిరి, పెనుకొండతో పాటు, అనంతపురం జిల్లాలోని రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు కాగ్ వెల్లడించింది. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం షెడ్యూల్ 1-ఏ రకరకాల సుంకాలు, రుసుముల రేట్లను తెలియజేస్తుంది.

- పెనుకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవిభాజ్య స్థల వాటాల అమ్మకాలు వర్గీకరించడంలో తీవ్ర అవకతవకలు జరిగినట్టు కాగ్ పేర్కొంది.
- కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల్లో గోల్‌మాల్ చేశారు. ఉమ్మడి ఆస్తిలో దస్తావేజుకు బదులుగా పారీఖత్తు దస్తావేజు (పార్టిసిపేషన్ డీడ్)గా చిత్రీకరించి విలువ తగ్గించారు. దీంతో సర్కారుకు భారీగా నష్టం వాటిల్లింది
- హిందూపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని దస్తావేజులను పరిశీలించగా, భూములు, స్థలాల విలువలను భారీగా తగ్గించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీనివల్ల రూ. కోట్లలో సర్కారు ఆదాయానికి గండి పడింది.

ఏసీబీ రిపోర్టు మేరకు చర్యలు

"రుద్రంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లభించిన డబ్బుపై త్వరలో ఏసీబీ రిపోర్టును బట్టి చర్యలు తీసుకుంటాం. ఆ నివేదిక కోసం వేచి చూస్తున్నాం. మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వచ్చిన ఆరోపణలపైనా విచారణ చేస్తాం. పూర్తయ్యాక చర్యలు ఉంటాయి.

–నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్, అనంతపురం

పత్తా లేని సబ్‌రిజిస్ట్రార్ అలీ

- ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా శివనారాయణ

అనంతపురం టౌన్: అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ అలీ జాడ కానరావడం లేదు. కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు చేసి ఆయన డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ నుంచి స్వాధీనం చేసుకున్న రూ.2.27 లక్షల అనధికార మొత్తాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఏసీబీ అధికారులు దాడులు చేసేలోపే మహబుబ్‌అలీ కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకూ ఎవరికీ కానరాలేదు. ఫోన్‌లో సైతం అందుబాటులోకి రావడం లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం రూరల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివనారాయణను ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా, డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ నుంచి స్వాధీనం చేసుకున్న అనధికార మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు ఇచ్చారు? అనే విషయంపై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు.

అంతర్జాతీయ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

రొద్దం: స్థానిక కేజీబీవీ విద్యార్థినులు అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ గురువారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ అండర్-15 సాఫ్ట్‌బాల్ విభాగంలో ప్రతిభ చూపడంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారన్నారు. జూన్‌లో చైనాలో జరిగే పోటీల్లో ఇండియా తరఫున పాల్గొంటారన్నారు. ఎంపికైన మౌనిక, ఉషారాణి, రాజేశ్వరిని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పెంపునకు చర్యలు చేపట్టండి

పుట్టపర్తి అర్బన్: ప్రజల అవసరాల మేరకు కొరత లేకుండా ఇసుక నిల్వల పెంపునకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్‌ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి జిల్లా ప్రజల అవసరాలు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు సరిపడా ఇసుక సేకరించి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచాలన్నారు. బత్తలపల్లి మండల పరిధిలోని దంపెట్ల, తాడిమర్రి మండల పరిధిలోని పీసీరేవు, సీసీరేవుల్లో కొత్తగా గుర్తించిన రెండు ఇసుక రీచ్‌లకు కమిటీ ఆమోదాన్ని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల ద్వారా వచ్చిన సూచనల మేరకు తదుపరి రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో గనులశాఖ డీడీ నాగయ్య, ఏడీ రామకృష్ణ, ఇరిగేషన్ ఈఈ ప్రతాప్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, భూగర్భ జలశాఖ అధికారి రాజశేఖరరెడ్డి, ఎంవీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు భగీరథ మహర్షి



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కఠోర శ్రమ చేస్తే దేన్నైనా సాధించవచ్చని నిరూపించిన భగీరథ మహర్షి ఆదర్శప్రాయుడని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాణ పురుషులు, సంఘ సంస్కర్తల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ భగీరథుని జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకుని యువత లక్ష్యాల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారిణి నిర్మలజ్యోతి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు నాగేంద్రరాజు, గంగాద్రి, లలితమ్మ, ఓబులేసు, డైట్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గ్రామాల్లో భూముల రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. అవసరమైతే స్టోన్ ప్లాంటేషన్ (హద్దు రాళ్ల నాటేందుకు) రోవర్లను వినియోగించుకోవాలని సూచించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఫైనల్ ఆర్‌ఓఆర్, డ్రోన్ ఫ్లైయింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో లక్ష్యం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ కానుకల లెక్కింపు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. 42 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా, రూ. 66,27,288 నగదు, 1102 అమెరికన్ డాలర్స్ అందాయన్నారు. గతంలో కంటే ఈసారి ఆదాయం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, కెనరా బ్యాంక్ మేనేజర్ మధుసూదన్, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

'పురం' విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



కె.జ్యోత్స్న



జాహ్నవి

హిందూపురం టౌన్: ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ఓ విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. ఆర్టీసీ కాలనీకి చెందిన కె.జ్యోత్స్న స్థానిక నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఈ విద్యార్థిని 1000 మార్కులకు 989 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థిని పలువురు అభినందించారు.

గ్రామీణ విద్యార్థినికి రాష్ట్రస్థాయి ర్యాంకు..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని యర్రంపల్లికి చెందిన గాలి అరుణ, మోహన్ రెడ్డి దంపతుల కుమార్తె గాలి జాహ్నవి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. జాహ్నవి కర్నూలు నారాయణ కళాశాలలో ఇంటర్ చదివింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 989/1000 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో ర్యాంకు, రాయలసీమలో మొదటి ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూసేకరణ చట్టం మేరకే పరిహారం

- పోతులనాగేపల్లి రైతులు కొందరు పరిహారం తీసుకున్నారు
- మరికొందరు కోర్టుకు వెళ్లగా... ఆ మొత్తం ఆర్డీఓ ఆధీనంలో ఉంది
- పత్రికలు, టీవీల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదు
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడి

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం మండలం పోతులనాగేపల్లి రైతులకు సంబంధించిన భూముల పరిహారానికి సంబంధించి వివిధ పత్రికలు, టీవీల్లో వస్తున్న కథనాల్లో ఏమాత్రం వాస్తవం లేదని కలెక్టర్ పి. అరుణ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లిలో 90 మందికి చెందిన 210 ఎకరాలను ఇళ్ల పట్టాల కోసం గతంలో సేకరించామన్నారు. రైతుల ఆధీనంలో ఉన్న ఈ అసైన్డ్ భూములకు భూ సేకరణ చట్టం ప్రకారం అధికారులు పరిహారాన్ని నిర్ణయించారన్నారు. ఇందులో 38 మంది రైతులు పరిహారాన్ని సైతం తీసుకున్నారని, మిగతా రైతులు ఈ పరిహారాన్ని అంగీకరించకుండా కోర్టులో కేసులు వేశారన్నారు. ఈ వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని వెల్లడించారు. ప్రభుత్వం పరిహారం కింద మంజూరు చేసిన మొత్తం ధర్మవరం ఆర్డీఓ వద్ద డిపాజిట్‌లో ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు యంత్రాంగం ప్రయత్నాలు చేస్తూనే ఉందన్నారు. వాస్తవం ఇది కాగా, దీన్ని వక్రీకరించి కొన్ని పత్రికలు తప్పుడు సమాచారాన్ని ప్రచురించాయని, కొన్ని టీవీలు వాస్తవ విరుద్ధమైన విషయాలను టెలికాస్ట్ చేశాయన్నారు. వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు

రాష్ట్రంలోని పేదలకు ఇళ్ల స్థలాలిచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహాయజ్ఞంలా కొనసాగిస్తోందని కలెక్టర్ వెల్లడించారు. 71,811.49 ఎకరాల్లో దాదాపు 30 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందని పేర్కొన్నారు. ఈ భూముల విలువ మార్కెట్‌లో దాదాపు రూ.75 వేల కోట్లపైనే ఉందన్నారు. ఇందులో 25,374.66 ఎకరాల ప్రైవేటు భూమిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఇందుకు ఏకంగా రూ.10,243 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇంతపెద్ద కార్యక్రమంపై అక్కడక్కడా కొంత మంది కోర్టులో కేసులు వేశారని వివరించారు. వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అవసరమైతే కోర్టు వెలుపల ఒప్పందాల ద్వారా పరిష్కారం దొరికేలా చూడాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందని, ఈ మేరకు ప్రక్రియ నడుస్తోందని వివరించారు.

రైతుల్ని వంచించిన పాపం టీడీపీదే

- పరిహారం పెంచకుండా కోర్టులో డిపాజిట్ చేసి అన్యాయం చేశారు
- తుంపర్తి, పోతుల నాగేపల్లి రైతుల పక్షాన పోరాడింది నేనే
- ఒక్కో రైతుకు జగనన్న కాలనీలో 5 సెంట్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాం
- బాధితుల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



టీడీపీ హయాంలో రైతులపై చేసిన దౌర్జన్యాలను ఫొటోలతో సహా వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: తుంపర్తి, పోతుల నాగేపల్లి రైతులను వంచించిన పాపం టీడీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. అన్నదాతల గోడు వినకుండా, తగినంత పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూసేకరణ చేపట్టి జీవితాలు బుగ్గిపాలు చేశారని ధ్వజమెత్తారు. అప్పట్లో ఆందోళన చేపట్టిన బాధితులను మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి వారిని 'చెప్పుతో కొట్టండి, ఈడ్చుకు వెళ్లండి' అని అన్నారని గుర్తు చేశారు. గురువారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆందోళన చేస్తున్న రైతులను సీఎం వైఎస్ జగన్ పట్టించుకోలేదని ప్రచారం చేయడం దారుణమన్నారు. ప్రతిపక్ష నాయకులు రైతుల్ని రెచ్చగొట్టి రాజకీయం చేశారని విమర్శించారు. రైతులు నిరసన చేస్తున్నారని ముందుగా ఎల్లో మీడియాకు ఎలా తెలిసిందని ఆయన ప్రశ్నించారు.

పచ్చటి పంట పొలాలను నాశనం చేశారు..

తుంపర్తి, పోతులనాగేపల్లి రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేపట్టి అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి నరకం చూపించారని ఎమ్మెల్యే కేతిరెడ్డి దుయ్యబట్టారు. కోర్టులో స్టేటస్ కో ఉన్నా లెక్క చేయకుండా పచ్చటి ద్రాక్ష, సపోటా, చీనీ పంటలను జేసీబీలు పెట్టించి ధ్వంసం చేయించారన్నారు. అడ్డుకున్న రైతులపై పోలీసులతో పిడిగుద్దులు కురిపించి మరీ అరెస్టు చేశారన్నారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా చేసిన దౌర్జన్యకాండను ఈ ప్రాంత ప్రజలు మరచిపోలేదన్నారు. రైతులు హైకోర్టును ఆశ్రయిస్తే ఎకరానికి రూ.5 లక్షల పరిహారం కోర్టులో జమ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

బాధితుల పక్షాన పోరాడింది నేనే..

తుంపర్తి, పోతుల నాగేపల్లి బాధిత రైతుల పక్షాన మొదటి నుంచి పోరాటం చేసింది తానేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధారాలతో సహా వివరించారు. ఎన్నోసార్లు బాధిత రైతులతో కలసి అప్పటి కలెక్టర్ వీరపాండియన్, జేసీ ఢిల్లీరావును కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశానన్నారు. టీడీపీ హయాంలో పరిహారం కింద రూ.5 లక్షలు కోర్టులో జమ చేయడంతో రైతులకు పరిహారం పెంపు సాధ్యం కాదని తెలిసిందని, ఈ క్రమంలో బాధిత రైతులకు ఏదో ఒక విధంగా న్యాయం చేయాలని ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో ఒక్కో రైతుకు 5 సెంట్ల చొప్పున ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందు కోసం రోడ్డుకు ఆనుకుని 8 ఎకరాలు రిజర్వ్ చేసి ఉంచామన్నారు. ఈ ప్రతిపాదనను రైతులకు చెబితే.. చాలా మంది అంగీకరించారన్నారు. ఇప్పుడు ఒకరిద్దరు రైతులను రెచ్చగొట్టి తమ ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తే ఎవరూ నమ్మరన్నారు. రైతులు తనని కలసి ఉంటే నేరుగా సీఎం దగ్గరకే తీసుకువెళ్లే వాడినని, కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా సీఎం పట్టించుకోవడం లేదని అభాండాలు వేయడం బాధాకరమన్నారు. రైతులకు ఇప్పటికీ తన వంతు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన భూసేకరణలో పార్టీలు చూడకుండా రేగాటిపల్లి రైతులకు ఎకరాకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించిన విషయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి గుర్తు చేశారు.

నవోదయ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

రాప్తాడు రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈనెల 29న జరిగే జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. సాయిరామ్ ఆదేశించారు. గురువారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో పరీక్ష నిర్వహణపై సీఎస్, సీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, నవోదయ పరీక్షకు 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అన్ని కేంద్రాల్లోనూ వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు పాల్గొన్నారు.

భక్తశ్రద్ధలతో గంధం వేడుక



ఖ్రమూర్దీన్ దర్గాలోని స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దర్గా నిర్వాహకులు, భక్తులు

పెనుకొండ: పట్టణ సమీపంలోని గోనిపేట రోడ్డులోని ఖ్రమూర్దీన్ ఆలీ బాబా దర్గాలో గంధం వేడుక గురువారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ఖ్రమూర్దీన్ ఆలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన గంధం వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గా నిర్వాహకులు ఖలీముల్లా ఇంటి నుంచి గంధాన్ని తీసుకుని భక్తులు, మత పెద్దలు, ఫక్కీర్ల విన్యాసాల నడుమ ఖ్రమూర్దీన్ దర్గాకు చేరుకున్నారు. అనంతరం గంధాన్ని స్వామి వారికి సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. అనేక మంది ప్రముఖులు స్వామి వారి దర్గాను దర్శించి ప్రార్థనలు నిర్వహించారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- తక్కువ ధరకే నాణ్యమైన వస్తువుల పేరుతో వల
- అకౌంట్లలో డబ్బు జమకాగానే ఫోన్ స్విచ్ ఆఫ్
- లబోదిబోమంటున్న బాధితులు



తాడిమర్రి: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆధార్ సాయంతో కొందరి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం చేస్తున్నారు. సెల్‌ఫోన్లకు లింకులు పంపిస్తూ ఇంకొందరు డబ్బు నొక్కేస్తున్నారు. మరి కొందరు కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని అందినకాడికి దోచేస్తున్నారు. చౌకగానే టీవీ, వాషింగ్ మెషీన్ అని ఆశపెడుతూ నట్టేట ముంచేస్తున్నారు. తాజాగా తాడిమర్రి మండలంలోని పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్నారు.

తక్కువ ధరకే టీవీ పేరుతో...

తాడిమర్రి మండల కేంద్రం కునుకుంట్ల క్రాస్ కార్నర్‌లో ఉన్న ఆర్ఎంపీకి మంగళవారం సెల్‌నంబర్ 9908964041 నుంచి ఫోన్ వచ్చింది. అగ్రహారం గ్రామానికి చెందిన నరసింహులుగా చెబుతూ... పలుమార్లు మీవద్ద వైద్యం చేయించుకున్నానని నమ్మబలికారు. డబ్బులు లేకపోయినా వైద్యం చేశారని అభినందించారు. అనంతపురంలో తనకు తెలిసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇళ్లు ఖాళీచేసి వేరే ప్రాంతానికి వెళ్తున్నారని, ఇటీవలే కొన్న 52 ఇంచుల సోనీ కలర్ టీవీ, అమరాన్ డబుల్ బ్యాటరీ ఇన్‌వర్టర్ కేవలం రూ.18 వేలకే ఇస్తున్నట్లు తెలిపారు. అతని మాటలు నమ్మిన ఆర్ఎంపీ ఫోన్‌పే ద్వారా డబ్బు పంపుతామని బదులిచ్చారు. అయితే తనకు ఫోన్‌పే లేదని, బ్యాంకు అకౌంట్‌కు పంపాలని అవతలి వ్యక్తి పేర్కొన్నారు. బ్యాంకు అకౌంట్ నంబర్ 309017974008, ఐఎఫ్‌సీ కోడ్ ఆర్ఏటీఎన్ 0000444 చెప్పారు. దీంతో ఆర్ఎంపీ వెంటనే నెట్‌సెంటర్‌కు వెళ్లి రూ.18 వేలు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించారు. అలాగే వాషింగ్ మిషిన్, దివాన్ కాట్ తక్కువకే వస్తున్నాయనడంతో మరో రూ.8,500 బ్యాంక్ ఖాతాకు పంపారు. సాయంత్రానికే వస్తువులు ఇంటికి వస్తాయని ఆర్ఎంపీ ఎదురు చూశారు. రాత్రి కావస్తున్నా వస్తువులు రాకపోవడంతో ఆర్ఎంపీ తన సెల్‌నుంచి తనకు ఉదయమే వచ్చిన నంబర్‌కు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని రాగా మోసపోయానని గ్రహించి తనకు పరిచయం ఉన్న కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సూచన మేరకు సైబర్ పోలీసులను సంప్రదించారు. వారు కూడా పెద్దగా స్పందించలేదని బాధితుడు వాపోతున్నారు.

10 మంది దాకా బాధితులు...

తాడిమర్రి మండలం కునుకుంట్ల రోడ్డులో మటన్ షాపు నిర్వాహకునికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. టీవీ, ఇన్‌వర్టర్ తక్కువ ధరకే వస్తాయని నమ్మించడంతో మటన్‌షాపు నిర్వాహకుడు కూడా కర్నాటక బ్యాంక్ ఖాతాకు రూ.12 వేలు జమ చేసి మోసపోయారు. శివంపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, తాడిమర్రికి చెందిన గూండా నాగరాజు అనే వ్యక్తులకు కూడా ఇలాంటి ఫోన్లు రావడంతో వారు అప్రమత్తమై డబ్బు పోగొట్టుకోకుండా జాగ్రత్త పడ్డారు. సైబర్ కేటుగాళ్ల ఉచ్చులో 10 మంది దాకా పడ్డారని చాలా మంది బయటకు చెప్పుకోలేక పోతున్నారని తెలిసింది. ఈ ఘటనపై ఎస్ఐ డీ.లక్ష్మీనారాయణను 'సాక్షి' వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు.

పన్ను వసూలుకు కృషి చేయండి



రొద్దం: గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న చైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి

రొద్దం: మండల కేంద్రంలోని గ్రంథాలయన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులును పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వసూలు చేయడానికి కృషి చేయాలని స్థానిక అధికారి నాగరాజుకు సూచించారు. గ్రంథాలయ సంస్థ పనితీరు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలపై అక్కడున్న పాఠకులతో అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు కావాలంటే డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తే సాధ్యమైనంత త్వరగా తెప్పిస్తామన్నారు.

పెనుకొండ: పెనుకొండలో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. పని వేళల గురించి ఆరా తీశారు. రికార్డులు, గ్రంథాలయ నిర్వహణపై గ్రంథాలయాధికారి మహబూబ్‌బాషాను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు రఫీక్

గోరంట్ల: మండల పరిధిలోని మిషన్ తండా సమీపంలో గురువారం సాయంత్రం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుకొండ పట్టణంలోని రెవెన్యూ కాలనీకి చెందిన రఫిక్ (53) మృతి చెందారు. సీఐ సుబ్బరాయుడు వివరాలమేరకు.. రఫిక్ కర్ణాటక రాష్ట్రం గుడిబండ తాలుకా ఉర్లకొండ సమీపంలోని మైనింగ్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేశాడన్నారు. పని ముగించుకొని ద్విచక్ర వాహనంలో పెనుకొండ వెళ్తుండగా మిషన్ తండా సమీపంలో మలుపు వద్ద కియా అనుబంధ కంపెనీకి చెందిన కంటైనర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రఫిక్ అక్కడిక్కడే మృతి చెందారు. మృతునికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కనగానపల్లిలో మరొకరు...

కనగానపల్లి: మండల పరిధిలోని పాతపాళ్యం సమీపంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో అనిల్‌కుమార్ (21) అనే యువకుడు చనిపోయాడు. పోలీసుల వివరాలమేరకు.. నూతిమడుగుకు చెందిన అనిల్ కుమార్ తన మిత్రులతో కలసి పాతపాళ్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చాడు. తిరిగి తన మిత్రులు మహేష్, మల్లికార్జునలతో కలసి పాతపాళ్యం నుంచి తగరకుంటకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న మద్దెలచెరువు పవన్‌కుమార్ అనే యువకుడు వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనిల్‌తో పాటు అతని మిత్రులిద్దరూ గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన అనిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

మెరుగైన సేవలందించాలి



రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రొద్దం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ చైర్మన్ తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. మండల పరిస్థితులు, నిధుల మంజూరుపై ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏఓ నబీరసూల్‌ను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్యాలయాలనికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణ రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల అదృశ్యం



నదీం హుసేన్



షాకీరాభాను

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. జయనగర్‌కాలనీకి చెందిన నదీం హుసేన్ (19) అనే విద్యార్థి వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల నదీం హుసేన్ ఇంటికి వచ్చాడు. సక్రమంగా చదువుకోవడం లేదంటూ తండ్రి బాషాజాన్ కుమారుడిని మందలించాడు. ఈనెల 25న నదీం హుసేన్‌ను వరంగల్‌కు బస్సు ఎక్కించాడు. అయితే నదీం హుసేన్ యూనివర్సిటీలోని తన హాస్టల్‌కు వెళ్లకపోవడంతో కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని విద్యార్థి తండ్రి బాషాజాన్‌కు ఫోన్‌లో చెప్పారు. దీంతో గురువారం బాషా జాన్ పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

కళాశాలకు వెళ్తానని చెప్పి...

పట్టణంలోని అమ్మవారిశాల వీధికి చెందిన దూదేకుల షాకీరాభాను (21) స్థానిక జేసీ నాగిరెడ్డి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఎప్పటిలాగే షాకీరాభాను గురువారం ఉదయం తన ఇంట్లో కళాశాలకు వెళతానని చెప్పి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో తండ్రి లాలెప్ప పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సబ్ జూనియర్ రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా జూనియర్ బాల, బాలికల రగ్బీ జట్లు

హిందూపురం టౌన్: ఉమ్మడి అనంత జిల్లా జూనియర్ బాల, బాలికల రగ్బీ జట్లను ఎంపిక చేశారు. గురువారం స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలో రగ్బీ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి యాసిన్ మాలిక్, డైరెక్టర్ ముస్తఫా కమల్ బాషా ఆధ్వర్యంలో పీఈటీలు వేదవతి, రూపవతి, లక్ష్మీ, సురేష్, శీన, విష్ణుల పర్యవేక్షణలో జిల్లా రగ్బీ జట్ల ఎంపిక చేపట్టారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి మే 1 వరకు కర్నూలులోని ఆదర్శ పాఠశాలలో జరగనున్న 8వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల రగ్బీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికల జట్టుకు మేనేజర్‌గా మౌనిక, కోచ్‌గా పీఈటీ రూపవతి, బాలుర జట్టుకు విష్ణువర్ధన్ వ్యవహరిస్తారన్నారు.

జూనియర్ బాలుర జట్టు : భరత్, గౌతమ్ కుమార్, చంద్రశేఖర్, దిలీప్‌కుమార్, రామ్‌చరణ తేజ్, వెంకటరమణ, అజయ్‌కుమార్, నందకిశోర్, విష్ణువర్ధన్, సందీప్ రెడ్డి, నితీష్‌కుమార్ రెడ్డి, సజ్జరాయుడు.

జూనియర్ బాలికల జట్టు: మనీషా, వనజ, అఖిల, జయశ్రీ, అర్తిక, వీణ, లోహిత, నాగేశ్వరీ, జ్యోతిక, నిఖిత, వందన, మౌనిక.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



జిల్లా జట్టు కెప్టెన్‌గా ఎంపికైన సంతోష్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా అండర్-23 వన్డే క్రికెట్ జట్టును గురువారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నెల 28 నుంచి మే 4వ తేదీ వరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహించనున్న అండర్-23 సౌత్‌జోన్ వన్డే క్రికెట్ టోర్నీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. జిల్లా జట్టుకు సంతోష్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

జిల్లా క్రికెట్ జట్టు: సంతోష్, దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, మహేంద్రరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, దీపక్, యోగానంద, ఖాదర్‌వలి, కామిల్, శ్రీనివాస్, రోహిత్‌రోషన్, విఘ్నేష్ దినకర్, చైత్రవర్ధన్, ప్రశాంత్, జయకృష్ణ, జయంత్‌కృష్ణ

స్టాండ్‌బైలు: జీవన్‌సాహిత్, రేవంత్‌రెడ్డి, వికాస్, ఆరిఫ్ రజా, లోహిత్ సాయి కిశోర్, వెంకట్ లోకేష్

నేడు వ్యక్తిత్వ వికాస నిపుణుడి రాక

పుట్టపర్తి: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు శుక్రవారం బుక్కపట్నం రానున్నారు. జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో జరగనున్న ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ప్రిన్సిపాల్ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టెప్ (స్టూడెంట్స్, టీచర్స్,పేరెంట్స్) కార్యక్రమంలో పాల్గొంటారని ఏకాగ్రత, రీప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్ అనే అంశాలపై సుబ్బారావు ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరులో గురువారం హర్షిణీ అనే ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాలమేరకు.. తిరుపతి నారాయణ జూనియర్ కళాశాలలో హర్షిణీ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువుతోంది. ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్థాపంతో ఇంట్లోనే పురుగుల మందు సేవించింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

నడిమిగడ్డపల్లిలో...

మండల పరిధిలోని నడిమిగడ్డపల్లి తండాకు చెందిన మారుతీ నాయక్ అనంతపురంలోని సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపీసీ) చదువుతున్నాడు. ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్థాపంతో గురువారం ఇంట్లోనే విషద్రావకం తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మదనపల్లె: గుర్తుతెలియని యువకుడు (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పొన్నేటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు వెళ్లే మార్గంలో ఓ గుర్తుతెలియని యువకుడు మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని తాలూకా పోలీసులకు అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఆధారాల కోసం వెతికారు. ఘటనపై ఆరా తీశారు. మృతుడు ఈ ప్రాంతవాసి కాదని స్థానికులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా? అనే అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే మృతుడి చొక్కా బటన్ విప్పి ఉండటం, నోటిలో బెల్లం ముక్క ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా యువకుడు శ్రీసత్యసాయి జిల్లా కొక్కంటిక్రాస్ వాసిగా ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి ..

హిందూపురం: పట్టణంలోని కాంచికామాక్షి కల్యాణ మండపం సమీపంలోని టీస్టాల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ ఈరన్న తెలిపారు. మృతుడు మెడలో శిలువ డాలర్ వేసుకున్నాడు. బ్లూకలర్ జర్కిన్ షర్టు, పర్పుల్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. శవాన్ని పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే సెల్‌నంబర్ 9440796844కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన ప్రముఖులు

ప్రశాంతి నిలయం: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యునివర్సిటీలో చిరుధాన్యాలు - ఆరోగ్యం, పోషక విలువలు అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, యునివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్‌మీనా, చాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్ జ్యోతి అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ భరత్‌లాల్ మీనా మాట్లాడుతూ ఆధునిక కాలంలో మానవుని ఆహారపు అలవాట్లు ఆరోగ్యవంతమైన జీవితాన్ని నియంత్రిస్తున్నాయన్నారు. పోషకాలు లోపించిన ఆహారం, కలుషిత ఆహారం మూలంగా ఆరోగ్యాన్ని కోల్పోవాల్సివస్తోందన్నారు. వైద్యులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ రూపా వాసుదేవన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒక పెద్ద సవాలుగా మారిందన్నారు. పోషక విలువలను కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య భాగ్యం పొందవచ్చునన్నారు. అనంతరం చిరుధాన్యల రకాలు, వాటిలో లభించే పోషకాలు, వాటి సాగు, ఆవశ్యకత, వాటి సాగు పద్ధతులు వంటి అంశాలపై వక్తలు చర్చించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ సీనియర్ సైంటిస్ట్ కెబీఆర్ఎస్ విశారద, విశ్రాంత రీసెర్చ్ డైరెక్టర్ ఎం.ఎ శంకర్, ఆంగ్రూ, ఏఆర్ఎస్ అనంతపురానికి చెందిన డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, ప్రకృతి వనం ఫౌండర్ ఎంసీవీ ప్రసాద్, టీఎస్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమరాపురం: మండల సరిహద్దులో ఉన్న అరసికెర గ్రామానికి చెందిన గోవిందప్ప (40) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య మంజుల తెలిపిన వివరాల మేరకు... గోవిందప్పకు మతిస్థిమితం లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ తిరిగేవాడన్నారు. వారం రోజుల క్రితం నుంచి గ్రామం విడచి వెళ్లారన్నారు. అయితే చిట్నడకులోని గురుదేవప్ప తోటలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తోట యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.40 వేలు మాయం

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన రామాంజినేయులు అనే సప్లయర్ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.40 వేలు కొట్టేశారు. బాధితుడి వివరాలమేరకు... మండలంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 217010100006427 బ్యాంకు ఖాతా నుంచి ఈనెల 22 నుంచి నుంచి 26వ తేదీ దాకా నాలుగు సార్లు మొత్తం రూ.40 వేలు విత్‌డ్రా చేసినట్లు రామాంజినేయులు సెల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. దీంతో వెంటనే సంబంధిత బ్యాంకుకు వెళ్లి సిబ్బందిని సంప్రదించగా సైబర్ నేరగాళ్ల పని అని తెలపడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం రాత్రి మస్తాన్ బీ అనే మహిళ మెడలోని బంగారు చైన్‌ను ఓ దొంగ అపహరించాడు. వివరాల్లోకి వెళితే... తాడిపత్రి రోడ్డులో దుకాణంలో కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన దుండగుడు ఒక్క ఉదుటను ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. బాధితురాలు గట్టిగా అరవడంతో స్థానికులు చైన్ స్నాచర్‌ను పట్టుకోవడానికి వెంట పడ్డారు. అయినా దొంగ మాత్రం వారికి దొరకలేదు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు మస్తాన్‌బీ ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.